
సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 7 । జూన్ । 2024



పంట బీమాపై ఆశలు

వానాకాలం సీజన్‌లో అమలు చేయనున్న పంటల బీమా పథకంపై వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. 8లో



వెలగనున్న 'గృహజ్యోతి'

ఎన్నికల కోడ్ ముగిసింది. గృహజ్యోతికి లైన్ క్లియర్ అయ్యింది. వినియోగదారులు ఎదురుచూపులకు తెరపడనుంది. 8లో

అంత్యక్రియలు పూర్తి



ఆస్ట్రేలియాలో మృతి చెందిన షాద్‌నగర్‌కు చెందిన అరవింద్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తి చేశారు. 8లో

న్యూస్‌రీల్


దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కాళ్ల జంగయ్య

మంచాల: ప్రభుత్వం దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చి ఆరు నెలలు దాటినా దివ్యాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు పర్చడం లేదని విమర్శించారు. ఆసరా పింఛన్లు పెంచుతామని గొప్పలు చెప్పడం తప్ప పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు నెలకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు నెలకు రూ. 4వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ప్రభుత్వం దివ్యాంగులకు మాత్రం ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలరాజు, జంగయ్య, రవి, దానయ్య, మల్లేశ్, సామాజిక కార్యకర్త బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు



కొందుర్గు: పోలీసుల దాడుల్లో 30 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడిన సంఘటన కొందుర్గులో వెలుగు చూసింది. ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. లూర్దునగర్‌లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారని తెలిసి నమ్మదగిన సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం లూర్దునగర్‌కు చెందిన సలిమెల్ల లూర్దు రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఓ ప్లాస్టిక్ బస్తాలో ప్రభుత్వం నిషేధించిన (బీటీ 3 విత్తనాలు) లూజ్ విత్తనాలు 30 కిలోలు లభించాయి. ఈ విషయమై లూర్దురెడ్డిని విచారించగా పటాన్‌చెరువుకు చెందిన రాజప్ప రెడ్డి ద్వారా కొనుగోలు చేసి కొందుర్గు పరిసర గ్రామాల రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. ఈ మేరకు విత్తనాలు సీజ్‌చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నీట్‌లో 'పట్నం' విద్యార్థి ప్రతిభ



ఆకాష్

ఇబ్రహీంపట్నం: నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)లో ఇబ్రహీంపట్నానికి చెందిన కె.ఆకాష్ ఉత్తమ మెడికల్ ర్యాంక్ సాధించాడు. 720కిగాను 695 మార్కులతో జాతీయ స్థాయిలో 2,939వ ర్యాంకు సాధించాడు. గచ్చిబౌలిలోని నవోదయ పాఠశాలలో పదో తరగతి, చైతన్యపురిలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదివాడు. అతని తల్లిదండ్రులు రవి, స్వాతి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఉత్తమ ర్యాంకు సాధించి మెడికల్ విద్యను అభ్యసించేందుకు సిద్ధమవుతున్న ఆకాష్‌ను స్థానికులు అభినందించారు.

వరద నీరు నిలువకుండా శాశ్వత పరిష్కారం

కమిషనర్ రోనాల్డ్ రాస్

మాదాపూర్: వరద నీటి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సూచించారు. గురువారం మాదాపూర్‌లో సమస్యాత్మక ప్రాంతాల్లోని వాటర్ స్టాగ్నేషన్ పాయింట్‌లను ఆయన పరిశీలించారు. వరద నీరు నిలువ ఉండడంతో వాహనాల రాకపోకలు జటిలంగా మారుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవుతున్నాయన్నారు. శేరిలింగంపల్లి జోన్ సర్కిల్ పరిధిలో బాటా షోరూం, యశోద హాస్పిటల్, శిల్పారామం వద్ద స్టాగ్నేషన్ పాయింట్‌లను పరిశీలించారు. వరదనీరు నిలువకుండా శాశ్వత చర్యలు తీసుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జోనల్ కమిషనర్ స్నేహ సబర్వాల్, ఎస్‌ఈ శంకర్, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'క్రాస్'.. లాస్!



- భారీగా బదిలీ అయిన బీఆర్‌ఎస్ ఓట్లు
- అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మూడో స్థానానికి పడిపోయిన కారు
- సిట్టింగ్ స్థానాల్లోనూ పట్టు నిలుపుకోలేకపోయిన గులాబీ పార్టీ
- బీఆర్‌ఎస్ ఓట్లు మాత్రమే కాదు.. కాంగ్రెస్ ఓట్లు సైతం క్రాస్
- స్పష్టం చేసిన లోక్‌సభ ఫలితాలు

చేవెళ్ల అసెంబ్లీ పరిధిలో..

పార్టీ	2023 అసెంబ్లీ	2024 లోక్‌సభ
బీఆర్‌ఎస్	76,210	21,064
కాంగ్రెస్	75,934	71,678
బీజేపీ	38,450	93,778

మహేశ్వరం అసెంబ్లీ పరిధిలో..

పార్టీ	2023 అసెంబ్లీ	2024 లోక్‌సభ
బీఆర్‌ఎస్	1,25,549	37,215
కాంగ్రెస్	70,616	99,175
బీజేపీ	99,391	1,49,527

రాజేంద్రనగర్ అసెంబ్లీ పరిధిలో..

పార్టీ	2023 అసెంబ్లీ	2024 లోక్‌సభ
బీఆర్‌ఎస్	1,21,283	28,529
కాంగ్రెస్	81,055	1,38,495
బీజేపీ	88,978	1,57,701

శేరిలింగంపల్లి అసెంబ్లీ పరిధిలో..

పార్టీ	2023 అసెంబ్లీ	2024 లోక్‌సభ
బీఆర్‌ఎస్	1,56,577	42,687
కాంగ్రెస్	79,664	1,04,472
బీజేపీ	46,647	1,78,249

వికారాబాద్ అసెంబ్లీ పరిధిలో..

పార్టీ	2023 అసెంబ్లీ	2024 లోక్‌సభ
బీఆర్‌ఎస్	73,992	13,959
కాంగ్రెస్	86,885	75,361
బీజేపీ	7,132	67,584

పరిగి అసెంబ్లీ పరిధిలో..

పార్టీ	2023 అసెంబ్లీ	2024 లోక్‌సభ
బీఆర్‌ఎస్	74,523	23,142
కాంగ్రెస్	98,536	71,816
బీజేపీ	16,653	74,024

తాండూరు అసెంబ్లీ పరిధిలో..

పార్టీ	2023 అసెంబ్లీ	2024 లోక్‌సభ
బీఆర్‌ఎస్	78,079	10,598
కాంగ్రెస్	84,662	69,864
జనసేన	4,087	77,654 (బీజేపీ)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తాజా లోక్‌సభ ఎన్నికల్లో కారు పార్టీ ఓట్లు భారీగా క్రాస్ అయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా లోక్‌సభ ఫలితాలు రావడాన్ని పరిశీలిస్తే బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్ ఓట్లు సైతం క్రాస్ అయినట్లు స్పష్టమవుతోంది. చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోనే కాదు జిల్లాతో ముడిపడి ఉన్న భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానాల పరిధిలోనూ కారు పార్టీ ఘోరంగా దెబ్బతింది.

షాద్‌నగర్‌లో షాక్..

మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలోని షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు బీఆర్‌ఎస్‌కే కాదు కాంగ్రెస్‌కు సైతం షాక్ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యకు 76,947 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి వై.అంజయ్య యాదవ్‌కు 70,385 ఓట్లు, బీజేపీ నుంచి పోటీ చేసిన అందె బాబయ్యకు 8,078 ఓట్లు వచ్చాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి 76,100 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీలో వచ్చిన ఓట్లతో పోలిస్తే 847 ఓట్లు తక్కువ వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాసరెడ్డికి 31,670 ఓట్లు వచ్చాయి. ఇక బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ఏకంగా 68,096 ఓట్లు రావడం గమనార్హం. అసెంబ్లీలో పోలైన ఓట్లతో పోలిస్తే..లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి బీజేపీకి భారీగా పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో రెండో స్థానంలో ఉన్న బీఆర్‌ఎస్.. తాజా లోక్‌సభ ఎన్నికల్లో మూడో స్థానానికి పడిపోయింది.

'పట్నం'లో పల్టీకొట్టిన కారు

భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో ఇటీవల అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి 1,24,447 ఓట్లు రాగా, అప్పటి బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 84,320 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌కు 15,790 ఓట్లు రాగా, సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యకు 4,019 ఓట్లు మాత్రమే వచ్చాయి. తాజాగా భువనగిరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 88,013 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు 84,044 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు 39,541 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక సీపీఎం అభ్యర్థి మహ్మద్ జహంగీర్‌కు 5,689 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో మూడో స్థానానికి పడిపోయింది. బీఆర్‌ఎస్ ఓట్లు మాత్రమే కాదు కాంగ్రెస్ ఓట్లు కూడా బీజేపీకి బదిలీ అయ్యాయి.

కల్వకుర్తిలోనూ క్రాస్ ఓటింగ్..

నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ ఓట్లు బీఆర్‌ఎస్‌కు క్రాస్ అయినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పొందిన ఓట్ల కంటే.. లోక్‌సభ ఎన్నికల్లో పది వేలకుపైగా రావడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి 75,858 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ఆచారికి 70,448 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్‌కు 42,847 ఓట్లు మాత్రమే వచ్చాయి. అదే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి 63,720 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌కు 51,177 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 51,893 ఓట్లు రావడం విశేషం.

ఎల్బీనగర్‌లో ఇలా..

మల్కాజ్‌గిరి లోక్‌సభస్థానం పరిధిలోని ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్లు గతానికి భిన్నమైన తీర్పు ఇచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి స్థానంలో ఉన్న బీఆర్‌ఎస్ 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మూడో స్థానానికి పడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి 1,11,380 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి సామరంగారెడ్డికి 89,075 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్‌కు 83,273 ఓట్లు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 1,71,683 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డికి 68,095 ఓట్లు వచ్చాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిరి లక్ష్మారెడ్డికి కేవలం 33,838 ఓట్లు రావడం గమనార్హం. కారు ఓట్లే కాదు..హస్తం ఓట్లు కూడా కమలం వైపు క్రాస్ అయ్యాయి.

ఆ కుటుంబాలకు కలిసిరాని లోక్‌సభ ఎన్నికలు

ఉమ్మడి జిల్లా రాజకీయాలను ఏళ్లుగా శాసిస్తున్న పటోళ్ల, పట్నం కుటుంబాలకు లోక్‌సభ ఎన్నికలు కలిసి రావడం లేదు. గతంలో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పటోళ్ల ఇంద్రారెడ్డి టీడీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందగా, పట్నం మహేందర్ రెడ్డి కూడా ఇదే లోక్‌సభ స్థానం నుంచి అన్న టీడీపీ (లక్ష్మీపార్వతి వర్గం) నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2014లో చేవెళ్ల లోక్‌సభ స్థానం నుచి కాంగ్రెస్ అభ్యర్థిగా పటోళ్ల కార్తీక్‌రెడ్డి పోటీ చేసి ఓటమి పాలు కాగా, తాజాగా 2024లో మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పట్నం సునీతారెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దివంగత పటోళ్ల ఇంద్రారెడ్డి, పట్నం సునీ తామహేందర్‌రెడ్డి కుటుంబాలకు లోక్‌సభ ఎన్నికలు కలిసి రావడం లేదనే అంశం మరోసారి స్పష్టమైంది.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి



హెచ్‌ఎంలతో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

- పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు మౌలిక సదుపాయాలు కల్పించాలి
- జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

షాద్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఆదేశించారు. షాద్‌నగర్ పట్టణంలోని ఎంఆర్‌సీ భవనంలో గురువారం హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని అన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల మరమ్మతు పనులు, విద్యుత్ సదుపాయం వంటి అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయించాల్సిన బాధ్యత అధికారులు, ఆదర్శ కమిటీ సభ్యులదేనని స్పష్టం చేశారు. విద్యార్థులకు సకాలంలో యూనిఫాం పంపిణీ చేయాలని సూచించారు. దుస్తులు కుడుతున్న కేంద్రాలను హెచ్‌ఎంలు పర్యవేక్షించాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టాలని, బడీడు పిల్లలను గుర్తించి వారందరినీ బడిలో చేర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే పాఠ్యపుస్తకాలు ఇప్పటికే మండల కేంద్రాలకు చేరుకున్నాయని, పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని డీఈఓ తెలిపారు. త్వరలో నోటుపుస్తకాలను సైతం ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా యూనిఫాం కుడుతున్న కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. సమావేశంలో మండల నోడల్ అధికారులు రసూల్, లక్ష్మణ్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సకాలంలో అందించండి



- యూనిఫాంల నాణ్యతలో రాజీ పడొద్దు
- కలెక్టర్ శశాంక
- సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్కూలు యూనిఫాంలను సకాలంలో అందించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి గురువారం ఆయన సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల కొలతలకు అనుగుణంగా నాణ్యతతో కుట్టేలా పర్యవేక్షించాలని, నిర్దిష్ట గడువులోగా తయారీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. మహిళా స్వయం సహాయక కేంద్రాల్లో తయారీ పూర్తయిన వెంటనే సంబంధిత ప్రధానోపాధ్యాయులకు అందించాలన్నారు. ప్రతి రోజు సగటున ఎన్ని సిద్ధం చేస్తున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 10వ తేదీలోపు ఆయా బడులకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంపిణీకి సంబంధించిన ప్రగతి నివేదికలను తనకు రోజు వారీగా అందించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా మెప్మా అధికారి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సోమవారానికి అందేలా చూడాలి..

కడ్తాల్: సకాలంలో యూనిఫాంలు సిద్ధం చేసి పాఠశాలలకు అందించాలని డీఆర్‌డీవో పీడీ శ్రీలత సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు అందించేందుకు జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఐకేపీ సెంటర్‌లో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో యూనిఫాంల తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం ఈ సెంటర్‌ను డీఆర్‌డీవో పీడీ శ్రీలత సందర్శించి పలు సూచనలు చేశారు. శనివారంలోగా యూనిఫాంలను సిద్ధం చేసి, సోమవారం ఉదయంలోగా పాఠశాలలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, ఏపీఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

మహిళా సంఘాల పనితీరు భేష్

- కితాబిచ్చిన ఎన్‌ఐఆర్డీ అధికారుల బృందం



మహేశ్వరం మండల మహిళా సమాఖ్యను సందర్శించిన ఎన్‌ఐఆర్డీ అధికారులు

మహేశ్వరం: మహిళా సంఘాల పనితీరు బాగుందని ఎన్‌ఐఆర్‌డీ బృందం హర్షం వ్యక్తం చేసింది. మండల సమాఖ్యను గురువారం వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఐఆర్డీ ప్రాజెక్టు మేనేజర్లు, జిల్లా మేనేజర్లు సందర్శించారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల ఐక్యత, ఆర్థికంగా ఎదిగే విధానం బాగుందని కితాబిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు తమ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ, ఏపీఎంలతో పాటు అధికారులు సంఘాల పనితీరు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఐఆర్డీ మేనేజర్ అభిషేక్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్లు వీరమల్లు, వెంకట్, మహేశ్వరం ఎంపీడీఓ శైలజ, ఏపీఎం సత్యనారాయణ, వివిధ రాష్ట్రాల మేనేజర్లు, సీసీలు సురేష్, యాదయ్య, నర్సింగ్ రావు, మహేశ్వరం మండల సమఖ్యా అధ్యక్షురాలు కవిత, అకౌంటెంట్ మాధవి, కంప్యూటర్ ఆపరేటర్ కల్పన తదితరుల పాల్గొన్నారు.

మహిళలు మరింతగా ఎదగాలి

రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉజ్వల సృజన



జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉజ్వల సృజన తదితరులు

చేవెళ్ల: మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉజ్వల సృజన అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య 70 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని భూపోరాట కేంద్రం సీపీఐ కాలనీ ఫేజ్ -2లో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల అధ్యక్షతన వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించిన అనంతరం ఉజ్వల సృజన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు పూర్తి హక్కులు, స్వేచ్ఛ, రక్షణలను ప్రభుత్వాలు ఇంకా కల్పించలేకపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు చైతన్యవంతులు కావాలని అప్పుడే హక్కులు సాధించుకుంటారన్నారు. సీపీఐ అనుబంధంగా ఉన్న భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.నీలమ్మ, ప్రధాన కార్యదర్శి ఎండీ షైమీద మాట్లాడుతూ.. జిల్లా మహిళా సమాఖ్య బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి, జిల్లా, మండల కమిటీ సభ్యులు కమల, విజయ, రమాదేవి, వెంకటమ్మ, సువర్ణ, అంజమ్మ, రేణుక, జయమ్మ, యాదగిరి పాల్గొన్నారు.

నిలిచిన భూ రిజిస్ట్రేషన్లు



జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ కార్యాలయం

జిల్లేడ్ చౌదరిగూడలో 15 రోజులుగా రైతుల అవస్థలు

కొందుర్గు: పదిహేను రోజులుగా జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో స్లాట్లు బుక్ చేసుకున్న రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారికి ఆరోగ్యం బాగులేక కొన్ని రోజులు, ఆపరేటర్ లేక కొన్ని రోజులు, తీరా ఇద్దరు విధుల్లో చేరితే ఎన్నికలు.. పరీక్షల విధులంటూ ఇంకొన్ని రోజులు తహసీల్దార్ కార్యాలయం (సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం)లో గత నెల 24 నుంచి ఇప్పటి వరకు భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఈ కార్యాలయంలో దాదాపు 200కు పైగా స్లాట్లు బుక్‌చేసి రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. మే 24కు ముందు ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్ హర్షద్ లాగిన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగేది. అయితే ఆయన కాలుకు గాయం కావడంతో సెలవులో ఉన్నారు. ఈ సందర్భంగా లాగిన్ తహసీల్దార్ జగదీశ్వర్‌కు మార్చాలని వినతి పెట్టారు. లాగిన్ మార్చే లోపే ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేందర్ తన తండ్రి అనారోగ్యానికి గురయ్యారని సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఆపరేటర్ తిరిగి విధుల్లో చేరగా తహసీల్దార్‌కు ఎన్నికలు, గ్రూప్–1 పరీక్షల విధులకు వెళ్లారంటూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాగడం లేదు. ఇలా గత పదిహేను రోజులుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోవడంతో రైతన్నలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు

తాపీమేస్త్రీల సమావేశంలో సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్ సాహేర్

మహేశ్వరం: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ దూకుసుపోతుందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్ సాహేర్ పేర్కొన్నారు. ఆ సంస్థ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను విడుదల చేసిందని ఆయన తెలిపారు. గురువారం మండల కేంద్రంలో శ్రీరామ స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాపులో తాపీమేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు ఈ సిమెంట్ సరైన ఎంపికని ఆయన అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని తెలిపారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు, సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలిపారు. డీలర్ నర్సింహ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని తెలిపారు. ఇతర సిమెంట్‌లతో పోలిస్తే ఇది చాలా బెటర్ అన్నారు. అంతకు ముందు తాపీమేస్త్రీలకు భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ఉపయోగాలు, మన్నిక, ఇతర విషయాలపై అవగాహన కల్పించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తాపీమేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.



తాపీమేస్త్రీకి కానుక అందజేస్తున్న మహ్మద్ సాహేర్

పిడుగుపాటుకు ఆవు మృతి



మృతి చెందిన ఆవు వద్ద విచారంలో రైతు

కేశంపేట: మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో గురువారం పిడుగుపాటుకు పాడి ఆవు మత్యువాత పడింది. గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాస్ వ్యవసాయంపైన ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నారు. దాదాపు రూ.70 వేల విలువ చేసే ఆవు మృతి చెందడంతో రైతు కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదురవుతాయని, ఆయన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత



డీసీఎంలో తరలిస్తున్న పశువులు

యాచారం: సాగర్‌రోడ్డుపై అక్రమంగా తరలిస్తున్న ఆవులను యాచారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా కొండమల్లెపల్లి సంత నుంచి గురువారం ఉదయం ఇద్దరు వ్యక్తులు 14 పశువులను కొనుగోలు చేసి నగరంలోని కబేళాకు తరలిస్తున్నారు. మార్గమధ్యలో యాచారం పీఎస్ పరిధిలోని మాల్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు చేయగా డీసీఎం వాహనంలో పశువులున్నట్లు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో పట్టుకున్న పశువులను నగరంలోని గోశాలకు తరలించారు. డీసీఎంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపారు.

పంట బీమాపై ఆశలు

ప్రీమియం చెల్లించనున్న ప్రభుత్వం

- కసరత్తు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
- వానాకాలం నుంచే వర్తింపునకు చర్యలు



షాబాద్‌లో సాగు చేసిన మొక్కజొన్న

షాబాద్: ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వానాకాలం సీజన్‌లో అమలు చేయనున్న పంటల బీమా పథకంపై వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరడం, ప్రీమియం చెల్లింపు, బీమా పరిహారం తదితర వాటితో పాటు పొరుగు రాష్ట్రాల్లో ఎలా అమలవుతున్నాయనే దానిపై అధ్యయనం చేస్తున్నారు. గతంలో అమలు చేసిన పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95 శాతం ప్రీమియాన్ని, మిగిలిన 5 శాతం రైతులు చెల్లించేవారు. పరిహారం పొందడంలో సమస్యలు ఉండటంతో గత ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేయలేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు ప్రీమియం మొత్తం చెల్లించాలనే నిర్ణయానికి వచ్చింది. దీంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి.

లోతుగా అధ్యయనం

జిల్లాలో వేలాది మంది రైతులు పంటలను సాగు చేస్తున్నారు. వరి ప్రధాన పంటగా, ఆ తర్వాత పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు. ప్రతి సంవత్సరం ఏదో రకంగా రైతులు పంటలను నష్టపోతున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం పంట బీమాపథకం అమలు చేస్తుంది. గతంలో బ్యాంకు నుంచి రుణం పొందే రైతులకు పంట బీమా తప్పనిసరి చేశారు. రుణంతో సంబంధం లేకుండా పంటలను సాగు చేసే రైతులు మాత్రం బీమా చేయడమనేది వారి ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. తర్వాత ప్రీమియం చెల్లింపు అనేది రైతుల ఇష్టానికి వదిలేశారు. పత్తికి వాతావరణ ఆధారిత గ్రామం యూనిట్‌గా, ఇతర పంటలకు మండల యూనిట్‌గా బీమా పథకాన్ని అమలు చేశారు. తాజాగా ఏఏ పంటలకు బీమా వర్తింపజేస్తారు. ప్రీమియం, పరిహారం, బీమా ఎలా అమలు అనేది తేల్చాల్సి ఉంది. వీటికి సంబంధించి వ్యవసాయశాఖ అధ్యయనం చేస్తుంది.

పక్కాగా అమలు

కొత్తగా అమలు చేయనున్న పంటల బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇందుకు ఇప్పటికే క్లస్టర్ల వారీగా వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్‌ను పరిగణలోకి తీసుకోనున్నారు. చాలా మంది ఏఈఓలు పంట పొలాలకు వెళ్లకుండా, రైతులను అడిగి రాస్తుండటం, పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో పంటల నమోదుపై గొడవలు జరుగుతుడటంతో పంటల బీమాను పకడ్బందీగా అమలు చేయాలంటే బయోమెట్రిక్ తీసుకోవాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతుండటంతో పంటల బీమా పథకాన్ని త్వరగా తేల్చాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లా వారీగా పంటల సాగు అంచనాలు, ప్రీమియం సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని కోరారు. పంటల బీమాకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించడం, బీమా కంపెనీలను సంప్రదించడం, ప్రీమియాన్ని నిర్ధారించడం, ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనతో వచ్చే ప్రయోజనాలను వినియోగించుకోవడంతో పాటు రైతులపై ఎలాంటి భారం పడకుండా పంటల పథకాన్ని అమలు చేయనుంది.

రైతులకు ప్రయోజనం



ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు రైతులను ఆదుకునేందుకు బీమా పథకం ఎంతో ఉపయోగపడుతుంది. వానాకాలం పంటల నుంచి రైతులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. యూనివర్సల్ కవరేజ్, ఎంపిక చేసిన ప్రాంతాల్లోని పంటలకు బీమా పథకం వర్తింపజేయడం, రైతులకు ఉచిత ప్రీమియం, వాటాను ప్రభుత్వం భరిస్తుంది. బీమా యోజన ప్రయోజనాలు రైతులు పొందేలా ఏఈఓలు రైతులకు అవగాహన కల్పిస్తారు.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

పట్టుబడిన నాటుసారా ధ్వంసం



పట్టుబడిన మద్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉజ్వలారెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని వివిధ కేసులలో పట్టుబడిన నాటుసారా, మద్యాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం సిబ్బంది ధ్వంసం చేశారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో జిల్లా సూపరింటెండెంట్ ఉజ్వలారెడ్డి, డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఆమనగల్లు సీఐ బద్యానాద్‌చౌహాన్‌ల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలలో నమోదైన 31 కేసులకు సంబంధించి పట్టుబడిన 116 లీటర్ల నాటుసారా, 136 లీటర్ల మద్యం, 31 లీటర్ల బీరు బాటిళ్లను నిర్వీర్యం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు కృష్ణప్రసాద్, అరుణ్‌కుమార్, సిబ్బంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో జాబితా విడుదల

శంషాబాద్ రూరల్ : మండలంలోని పాల్మాకులలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల అర్హుల జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ విష్ణుప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరిగిందన్నారు. జాబితాలో పేర్లు ఉన్న విద్యార్థులు సకాలంలో పాఠశాలకు వచ్చి ప్రవేశం పొందాలన్నారు.

వ్యక్తి అదృశ్యం



మల్లేష్ (ఫైల్)

శంషాబాద్ రూరల్ : బంధువుల ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాల్మాకులకు చెందిన డ్రైవర్ మల్లేష్ (35), అనూష దంపతులు ఈ నెల 1న పెద్దషాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు 2వ తేదీన ఉదయం వ్యక్తిగత పని నిమిత్తం పాల్మాకులకు వెళ్తున్నట్లు తెలిపి అక్కడ నుంచి మల్లేష్ వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో 27 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లను చూపిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్

సికింద్రాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ రవాణా చేసేందుకు ప్రయత్నించిన 27 కిలోల గంజాయి ప్యాకెట్లను గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన మేరకు.. రైల్వేస్టేషన్‌లో పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో 1వ ప్లాట్‌ఫామ్‌పై ఉంచిన ఒక ట్రాలీబ్యాగు, మరో షోల్డర్ బ్యాగు కనిపించింది. ప్లాట్‌ఫామ్ పైన ప్రయాణికులను, కూలీలను విచారించినప్పటికీ సదరు బ్యాగులు తెచ్చిన వ్యక్తుల సమాచారం లభించలేదు. అనుమానాస్పదంగా కనిపించిన లగేజీ బ్యాగులు తెరిచి చూడగా అందులో 17 గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున పోలీసులు గంజాయి ప్యాకెట్లు కలిగి ఉన్న బ్యాగులను స్వాధీనం చేసుకుని నిందితుల కోసం విచారణ చేపట్టారు. సమర్థవంతంగా తనిఖీలు నిర్వహించిన ఎస్‌ఐ మాజిద్ బృందాన్ని జీఆర్‌పీ ఎస్పీ షేక్ సలీమా అభినందించారు.

పిడుగుపడి యువకుడికి తీవ్ర గాయాలు



శ్రావణ్ (ఫైల్)


బంజారాహిల్స్: పిడుగుపాటుకు ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వినాయకనగర్ బస్తీకి చెందిన శ్రావణ్ అనే యువకుడు ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి సాయంత్రం సమీపంలోని రాక్ గార్డెన్ గుట్ట వద్దకు క్రికెట్ ఆడుకునేందుకు వెళ్ళాడు. ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం రావడంతో ఓ రాయి కిందకు చేరుకున్నారు. అందరికీ స్థలం లేకపోవడంతో శ్రావణ్ కొద్దిగా బయటకువచ్చి నిలబడ్డాడు. అదే సమయంలో భారీ మెరుపుతో కూడిన పిడుగు పడటంతో శ్రావణ్ ఎడమ వైపు భాగమంతా కాలిపోయి మెదడు దెబ్బతిని కాళ్లు చచ్చుపడిపోయాయి. వెంటనే తల్లి శైలజ కుమారుడిని అపోలో ఆస్పత్రిలో చేర్పించింది. ప్రస్తుతం శ్రావణ్ పరిస్థితి విషమంగా ఉందని ఆమె కన్నీరుమున్నీరైంది.

హత్య కేసులో నిందితుల రిమాండ్

మీర్‌పేట: కూతురి అత్తను హత్య చేసిన తండ్రి కేసులో నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గురువారం సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం కేసీ తండాకు చెందిన జటావత్ ప్రభు, శాంతి భార్యాభర్తలు. వీరి కూతురు స్వాతిని అల్మాస్‌గూడ వినాయక హిల్స్‌లో నివాసం ఉండే కొర్ర జయరామ్‌తో రెండేళ్ల క్రితం వివాహం చేశారు. పెళ్లైన కొద్ది రోజుల నుంచే అత్త లలిత(50) తనను వేధిస్తుందని తల్లిదండ్రులకు చెప్పింది. ఈ విషయంలో ఇరువర్గాలు పంచాయితీ పెట్టి సమస్యను సద్దుమణిగించారు. కానీ వారిలో ఎలాంటి మార్పు రాకపోగా గొడవలు ఎక్కువయ్యాయి. ఈ నెల 4వ తేదీన ప్రభు, శాంతి కూతురు ఇంటికి వచ్చారు. ఆ సమయంలో శాంతి, లలితతో గొడవకు దిగింది. మా ఇంటికి ఎందుకు వచ్చావని ఆమె శాంతిని బయటకు నెట్టివేసింది. వెంటనే ప్రభు కోపంతో లలితను హాల్‌లో నుంచి బెడ్ రూమ్‌లోకి తోసేశాడు. లలిత బతికి ఉంటే ఇలానే తరచూ గొడవలు జరుగుతాయని ఆమెను తొలగిస్తేనే జీవితం సాఫీగా ఉంటుందని భార్య శాంతి కూతురు స్వాతిలు ప్రభుకు నూరిపోశారు. ఆవేశంతో ఉన్న ప్రభు పక్కనే ఉన్న సుత్తెను తీసుకొని లలిత తలపై పలుమార్లు దాడి చేసి హత్య చేశాడు. ప్రభు అదే రోజు లొంగిపోగా శాంతి, స్వాతిలను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వెలగనున్న గృహజ్యోతి

- ఎన్నికల కోడ్ ముగియడంతో 200 యూనిట్లలోపు వారికి ఉచిత విద్యుత్
- జిల్లాలో 11.50 లక్షల మందికి చేకూరనున్న లబ్ధి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల కోడ్ ముగిసింది. గృహజ్యోతి పథకాన్ని అధికారులు ఉమ్మడి జిల్లా పరిధిలోని 200 యూనిట్లలోపు వినియోగదారులకు జూన్ నుంచి వర్తింపజేయనున్నారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఈ పథకం ఇప్పటి వరకు జిల్లాలో అమలు కాలేదు. సరూర్‌నగర్, రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, వికారాబాద్ సెక్షన్ల పరిధిలో నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారు 11.50 లక్షల మంది వరకు ఉన్నట్లు అంచనా. ఆహార భద్రత కార్డులు ఉన్న వారు ఈ పథకానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ ఈ నెల నుంచి జీరో బిల్లులు చేతికందనున్నాయి. గ్రేటర్‌లోని హైదరాబాద్‌లో ఇప్పటికే 10 లక్షల మందికిపైగా ఈ పథకం కింద లబ్ధి పొందుతుండగా, తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో జిల్లాలోని మరికొంత మందికి ఈ పథకం కింద లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే మీటర్ రీడింగ్ నమోదు, బిల్లుల జారీ ప్రక్రియ కూడా మొదలైంది.

చల్లబడిన నగరం.. తగ్గిన వినియోగం

మే మూడో వారం వరకు భగ్గున మండిన ఎండలు.. చివరి వారంలో తగ్గుముఖం పట్టాయి. గత నాలుగు రోజులుగా ఏదో ఒక చోట వర్షం కురుస్తూనే ఉంది. ఫలితంగా వాతావరణం చల్లబడింది. నిన్నమొన్నటి వరకు రోజంతా పని చేసిన ఏసీలు, కూలర్లు ప్రస్తుతం ఆఫ్ చేశారు. దీంతో కరెంట్ వినియోగం కూడా తగ్గింది. మే 31న 4,115 మెగావాట్లు డిమాండ్ ఉండగా, 87.03 ఎంయూల వినియోగం నమోదైంది. జూన్ 1న కూడా 4046 మెగావాట్లు నమోదైంది. తాజాగా గురువారం 71 ఎంయూలకు పడిపోయింది. అయితే ఈదురు గాలితో కూడిన వర్షానికి సరఫరా వ్యవస్థలో అంతరాయాలు తప్పడం లేదు. గురువారం సాయంత్రం భారీ ఈదురుగాలుల తో కూడిన వర్షానికి నగరంలో యాభైకిపైగా ఫీడర్ల పరిధితో సరఫరా నిలిచిపోయింది. అధికారులు వెంటనే అప్రమత్తమై.. సరఫరాను పునరుద్ధరించారు.

గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ తగ్గుదల ఇలా

తేది	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
మే 31	4115	87.39
జూన్ 01	4046	86.15
జూన్ 02	3856	77.60
జూన్ 03	3453	74.62
జూన్ 04	3592	76.20
జూన్ 05	3521	73.82

అరవింద్ అంత్యక్రియలు పూర్తి

మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు

షాద్‌నగర్: ఆస్ట్రేలియాలో మృతి చెందిన సాఫ్ట్‌వేర్ నింజనీర్ అరటి అరవింద్ భౌతిక కాయం స్వదేశానికి చేరుకుంది. షాద్‌నగర్ పట్టణానికి చెందిన బీజేపీ నేత దివంగత అరటి కృష్ణ ఉషారాణి దంపతుల కుమారుడు అరవింద్(35) ఆస్ట్రేలియాలోని సిడ్నీలో నివాసం ఉండేవారు. గత నెల 20న ఆయన ఇంట్లో నుంచి బయటికి వెళ్లి అదృశ్యమై 24న సముద్రంలో శవమై తేలిన విషయం అందరికి విదితమే. 17 రోజులకు అరవింద్ భౌతిక కాయం గురువారం ఉదయం సుమారు ఐదు గంటలకు ఆస్ట్రేలియా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చింది. కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి వెళ్లి మృతదేహాన్ని షాద్‌నగర్‌లోని స్వగృహానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మధ్యాహ్నం స్థానిక శ్మశాన వాటికలో అరవింద్ అంత్యక్రియలను పూర్తి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.